క్లుప్తంగా

చికిత్సకు ఆర్థిక సాయం



బాధితుడి కుటుంబ సభ్యులకు సొమ్ము అందజేస్తున్న స్వామినాథ్ తదితరులు

అల్లవరం: బెండమూర్లంక పంచాయతీ పరిధిలోని రెబ్బనపల్లి గ్రామానికి చెందిన పొన్నమండ సాయికృష్ణకు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో సేకరించిన రూ.75 వేల నగదుని సంఘం గౌరవాధ్యక్షుడు కర్రి స్వామినాథ్, సర్పంచ్ బర్రె సీతారత్నం చేతుల మీదుగా బాధితుడికి చికిత్స నిమిత్తం శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చిలకలపూడి రవికిరణ్, కొల్లు వెంకటేశ్వర ప్రసాద్, కొల్లాటి సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం



ఉపాధి పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ ఆదినారాయణమూర్తి

తాళ్లరేవు: జార్జిపేట పంచాయతీలోని పంట కాలువలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను సర్పంచ్ పేర్ని ఆదినారాయణ మూర్తి శుక్రవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలాలకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పంటకాలువలో పూడికలు తొలగించి కాలువను శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉపాధి కూలీలకు మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ రెడ్డి నాగేశ్వరరావు, విశ్రాంత జేడీ పెట్ల సూర్యనారాయణ రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ చింతా రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ రికార్డుల తనిఖీ



వీరేశ్వరస్వామి ఆలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న రామచంద్రమోహన్

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయ రికార్డుల్ని దేవాదాయశాఖ కేంద్ర కార్యాలయ అడిషనల్ కమిషనర్ కె.రామచంద్రమోహన్ తనిఖీ చేశారు. శుక్రవారం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో అన్నదాన ట్రస్ట్, టీఎంఎస్ పనితీరు, రికార్డులు, భక్తులకు అందుతున్న సేవలపై సిబ్బందిని, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణను అడిగి తెలుసుకొన్నారు. ఆన్‌లైన్ లావాదేవీలు, క్యాష్ బుక్ రికార్డుల్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డులు పరిశీలించానని చెప్పారు.

కుశుడు పాత్రధారి సుబ్రహ్మణ్యంకు సత్కారం



కుశుడు పాత్రధారి సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న బీజేపీ నేతలు

అమలాపురం రూరల్: పౌరాణిక చిత్రం లవకుశ విడుదలై 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సినిమాలో కుశుడు పాత్రధారి వి.నాగ సుబ్రహ్మణ్యంను బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి జంగా రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో అమలాపురంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. బీజేపీ చేనేత సంఘం నాయకుడు సారపల్లి పద్మినీకుమార్, ఈశ్వరగౌడ తదితరులు పూలమాల వేసి దుశ్శాలువాతో అభినందించారు.

వేంకటేశ్వరుని పుష్పోత్సవం

పి.గన్నవరం: ఎల్.గన్నవరంలో వేంచేసిన బీబీ నాంచారీ సహిత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం రాత్రి శ్రీపుష్పోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు ఖండవిల్లి లక్ష్మీ నారాయణాచార్యుల ఆధ్వర్యంలో అన్నాబత్తుల వీరన్న, విజయలక్ష్మి పుణ్య దంపతులతో పూజలు జరిగాయి. ముత్తయిదువలకు పసుపు, కుంకుమ, జాకెట్లు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సీహెచ్ చిట్టిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మన ఆరోగ్యం.. మన చేతుల్లోనే

అంబాజీపేట: ప్రస్తుత విభిన్న వాతావరణంలో మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మన చేతుల్లోనే ఉందని తద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని వైద్యాధికారి వి.గౌతమి, సీహెచ్‌ఓ బి.అప్పారావు అన్నారు. అంబాజీపేట, ముక్కామల పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. మన చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ నినాదించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఊరూరా 'జగనన్నే మా భవిష్యత్తు'

- ప్రారంభమైన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలు
- పాల్గొన్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



అమలాపురంలో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి విశ్వరూప్



ముమ్మిడివరంలో ఎమ్మెల్యే పొన్నాడకు హారతులిస్తున్న మహిళలు



అల్లవరంలో సంక్షేమ పథకాల లబ్ధిని తెలుపుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



సంక్షేమ పథకాలను వివరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

అమలాపురం టౌన్: గత నాలుగేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాల జాబితాలు, నగదు మొత్తాలను వివరిస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించే 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాలను శుక్రవారం గ్రామగ్రామాన ప్రారంభించారు. అమలాపురం మున్సిపాలిటీలోని 14వ వార్డులో కార్యక్రమాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ప్రారంభించి ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాల సమాచారాన్ని వివరించారు. భవిష్యత్‌లో అందనున్న సంక్షేమం గురించి తెలియజేశారు. ప్రతి ఇంటి గుమ్మాలకు సీఎం జగన్ చిత్రంతో ఉన్న 'జగనన్నే మా భవిష్యత్' స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, మున్సిపల్ వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంపై ప్రజల సంతృప్తి

ముమ్మిడివరం: పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న జగనన్న ప్రభుత్వంపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం నగరం పంచాయతీ 16వ వార్డులో శుక్రవారం జగనన్న మాభవిష్యత్ కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ప్రారంబించారు. గత 46 నెలల్లో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. గత ప్రభుత్వ పాలన, ప్రస్తుత ప్రభుత్వ పాలనను తెలియజేస్తూ కర పత్రాలను అందించారు. ఐదు ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని అడిగి ప్రజాభిప్రాయాలను సేకరించి ప్రజా మద్దతు పుస్తకంలో పొందుపరిచారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ కోలా గంగాభవానీ, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, కోలాబాబ్జి, వేటుకూరి బోసురాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్‌కు అపూర్వ స్పందన

అల్లవరం: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి వాడవాడలా ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తుందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. అల్లవరంలోని మొల్లేటిగరువులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గడప గడపకూ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలపై లబ్ధిదారుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కోడూరుపాడు, ఎంట్రుకోన, గోడిలంక, దేవగుప్తం, మొగళ్లమూరు, ఎస్.పల్లిపాలెం తదితర గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, ఏఎంసీ వైస్ చైర్మన్ తుట్టెపు బాబి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహ సారథుల కన్వీనర్ తిక్కా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: మండల పరిధిలోని పి.మల్లవరం పంచాయతీ ప్రత్తిగొంది గ్రామంలో పార్టీ రాష్ట్ర నేత కుడుపూడి శివన్నారాయణ స్వగృహం వద్ద జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఉప్పలగుప్తం: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి ఆధ్వర్యంలో మండలంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు.

కాట్రేనికోన: మండలంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి సారథ్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు.

అమలాపురం రూరల్: మండలంలోని పేరూరు గ్రామంలో గ్రామ సర్పంచ్ దాసరి అరుణ అధ్యక్షతన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు.

ముమ్మిడివరం సీఐగా కొండయ్య



ముమ్మిడివరం: ముమ్మిడివరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎన్.కొండయ్య నియమితులయ్యారు. ఇప్పటివరకూ సీఐగా పనిచేసిన ఎం.జానకిరామ్ వ్యక్తిగత అభ్యర్థనతో వీఆర్‌కు వెళ్లారు. కొండయ్య ఏలూరు నుంచి బదిలీపై ముమ్మిడివరం రానున్నారు. రెండు మూడు రోజుల్లో ఆయన సీఐగా బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో కొండయ్య ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేశారు.

17న లబ్ధిదారుల గుర్తింపు

కాట్రేనికోన: చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు ప్రభుత్వం చెల్లించే జీవనభృతి(మత్స్యకార భరోసా) కోసం లబ్ధిదారుల గుర్తింపు చేపడతామని ఎఫ్‌డీఓ రామకృష్ణ అన్నారు. ఈ నెల 17న రిజిస్ట్రేషన్ ఉన్న బోటు యజమానులు అందుబాటులో ఉండాలని, బోటులపై ఫొటోలు తీసి లబ్ధిదారుల్ని గుర్తిస్తామని చెప్పారు.

మహిళల ఆర్థిక బలోపేతానికి ఆసరా

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కు అందజేత



ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

ముమ్మిడివరం: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వైఎస్సార్ ఆసరా మూడో విడత నిధులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేశారని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత నిధుల విడుదల చెక్కు పంపిణీ సమావేశం జరిగింది. నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో చంద్రబాబు స్వయం శక్తి సంఘాల రుణాలు మాఫీ చేస్తానని చెప్పి మహిళలను మోసం చేశారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి తన పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం మహిళా సంఘాల రుణాలను మాఫీ చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారన్నారు. ముమ్మిడివరం మండలం, నగర పంచాయతీ పరిధిలో 1813 మహిళా సంఘాలకు సంబంధించి 14,247 మంది సభ్యులకు రూ.10,80,82,922 చెక్కును సంఘాల సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ కోలా గంగాభవానీ, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశిబాలమునికుమారి, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు జగతా పద్మనాభం, కోలా బాబ్జి, రాయపురెడ్డి జానకిరామయ్య, నగరపంచాయతీ వైస్ చైర్మన్లు రెడ్డి హేమసుందరి, వేటుకూరి బోసురాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో క్రైస్తవుల ప్రార్థనలు



తాళ్లరేవు బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ సోదరులు



ఈదరపల్లి బైబిలుమిషన్ స్వస్థతశాల ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే సువార్త యాత్ర



యానాం శిలువయాత్రలో పాల్గొన్న క్రైస్తవులు

తాళ్లరేవు: గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకుని చర్చిల్లో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల కేంద్రమైన తాళ్లరేవు బాప్టిస్ట్ చర్చిలో జెడ్పీటీసీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెవరెండ్ దొమ్మేటి శామ్యూల్‌సాగర్ మాట్లాడుతూ 2 వేల సంవత్సరాల క్రితం ఏసు ప్రభువు శిలువపై గడిపిన క్షణాలను, ఆయన చెప్పిన ఏడు మాటలను గుర్తు చేసుకుంటూ ఆరాధనలు చేస్తారని చెప్పారు. పాప విమోచన కోసం ఏసు ప్రభువు శిలువపై మరణించారన్నారు.

ఉప్పలగుప్తం: మండలంలో చల్లపల్లి, ఎస్.యానాం, ఉప్పలగుప్తం ప్రాంతాల్లోని పలు చర్చిల్లో క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చర్చిల్లో క్రైస్తవ భక్తులు ప్రార్థనలు చేసి, గీతాలాపనలు చేశారు. చల్లపల్లి బొండాడిపేట ఆర్‌సీఎం చర్చి క్రైస్తవులు చల్లపల్లి నుంచి ఎస్.యానాం వరకూ శిలువను మోస్తూ ఊరేగింపు నిర్వహించారు.

యానాంలో శిలువ యాత్ర

యానాం: ఏసుక్రీస్తును శిలువ వేసిన రోజును పురస్కరించుకుని శుక్రవారం యానాం నియోజకవర్గ పరిధిలో పలు చర్చిల్లో క్రైస్తవ సోదరులు భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే జరుపుకున్నారు. స్థానిక పురాతన రోమన్ కేథలిక్ చర్చి ఆధ్వర్యంలో శిలువ యాత్రను నిర్వహించారు. జార్జిపేట ఎంఎల్‌కే నగర్ ఆర్‌సీఎం చర్చి నుంచి యానాం పురవీధుల మీదుగా వందలాది మంది భక్తులతో శిలువయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్‌లు మరియదాసు, ఎస్‌బీవీ నాయుడు మాట్లాడుతూ క్రైస్తవులకు గుడ్‌ఫ్రైడే అనేది మానవాళికి విముక్తి కోసం ఏసు క్రీస్తు త్యాగాన్ని గుర్తుచేసుకునే రోజు అని పేర్కొన్నారు.

అమలాపురం రూరల్: ఈదరపల్లి బైబిలు మిషన్ స్వస్థతశాలలో గుడ్‌ఫ్రైడే ఆరాధన ఘనంగా జరిగింది. పాస్టర్ ఎఫ్రాయిం, విక్టోరియారాణి దంపతులు ఏసుక్రీస్తు శిలువలో పలికిన వాక్యాలు ప్రపంచానికి మార్గదర్శకమన్నారు. అనంతరం స్వస్థతశాల ప్రతినిధుల ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే సువార్త యాత్ర నిర్వహించారు.

మహిళను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ఆత్రేయపురం: మండలంలోని లొల్లలాకుల వద్ద ఒక మహిళను ఢీకొట్టి గాయాలు పాలైన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సీహెచ్ సుధాకర్ తెలిపారు. లొల్ల లాకుల వద్ద ఆత్రేయపురం గ్రామానికి చెందిన జుత్తుగ గౌరమ్మ జ్యూస్ వ్యాపారం చేసుకుని సామాన్లు సర్దుతుండగా రావులపాలెం నుంచి రాజహేంద్రవరం వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో గాయాలయ్యాయి. ఆమెను రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

కొత్తపేట: పవిత్ర రంజాన్ పురస్కరించుకుని ముస్లింలకు స్థానిక పారిశ్రామికవేత్త కె.రాము ఇఫ్తార్ విందు ఇచ్చారు. రంజాన్ మాసంలో ముస్లింలకు ముస్లిమేతరులు ఇఫ్తార్ విందు ఇవ్వడం సంప్రదాయం. దీనిలో భాగంగా శుక్రవారం సాయంత్రం స్థానిక కమ్మిరెడ్డిపాలెం మసీదులో రాము ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. విందు స్వీకరించిన ముస్లింలు రాముకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

సఖినేటిపల్లి: గ్రామానికి చెందిన గెద్దం జాన్‌కు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.లక్ష విలువైన చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే రాపాక వరప్రసాద రావు పంపిణీ చేశారు. కత్తిమండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన ఈ మేరకు జాన్‌కు అందజేశారు. కాగా అనారోగ్యంతో ఉన్న జాన్‌కు వైద్య ఖర్చులు నిమిత్తం పై మొత్తం మంజూరైంది. సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, నల్లి ప్రేమానందం, కె.రాకేష్ పాల్గొన్నారు.

భూరక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రామచంద్రపురం రూరల్: భూ హక్కుదారుకి ఎంతో మేలు కలిగే వైఎస్సార్ జగనన్న భూ రక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు విజ్ఞప్తి చేశారు. మండలంలోని హసన్‌బాదలో భూ రక్ష పథకంలో భాగంగా సర్వే ఆధారంగా రాళ్లు వేసి రాళ్ల ప్లాంటేషన్ కార్యక్రమాన్ని గ్రామంలో శుక్రవారం ప్రారంభించారు.

పూర్తి స్థాయిలో బూత్ కమిటీలు వేయాలి

అమలాపురం రూరల్: నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బూత్ కమిటీలు, శక్తి కేంద్రాలు పూర్తి స్థాయిలో వేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు అన్నారు. బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గం పోలింగ్ బూత్ స్వశక్తి కరణ్ అభియాన్ కార్యశాల సమావేశం పట్టణంలో ప్రెస్ క్లబ్‌లో అసెంబ్లీ కన్వీనర్ అయ్యల భాష అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా చిట్టిబాబు హాజరయ్యారు.

బాలాజీని దర్శించుకున్న రైల్వే సేఫ్టీ ఆఫీసర్

మామిడికుదురు: సౌత్ సెంట్రల్ రైల్వేశాఖ సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ జె.శ్రీనాథ్ కుటుంబ సభ్యులతో శుక్రవారం అప్పనపల్లి బాల బాలాజీ స్వామిని దర్శించుకున్నారు. వారికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఉభయ దేవేరులతో కొలువుదీరిన స్వామిని దర్శించుకున్న అనంతరం అర్చకుల నుంచి ఆశీర్వచనాలు అందుకున్నారు. ఆలయ ఈఓ ఎంకేటీ నాగవరప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆయనకు స్వామి చిత్రపటంతో పాటు ప్రసాదాలు అందించారు.

డయాలసిస్ పింఛన్ పంపిణీ

మామిడికుదురు: పాశర్లపూడిలంకలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న కొరటి వెంకటరాజుకు నూతనంగా మంజూరైన డయాలసిస్ పింఛన్ రూ.10 వేలను స్థానిక సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు శుక్రవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరితో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం పింఛన్ అందించి వారిని ఆదుకుంటుందన్నారు.

ఘనంగా బంగారమ్మ, మావుళ్లమ్మ తీర్థం



ఇసుకపూడిలో వేంచేసిన బంగారమ్మ, మావుళ్లమ్మ

అంబాజీపేట: ఇసుకపూడి గ్రామంలో వేంచేసిన బంగారమ్మ, మావుళ్లమ్మ అమ్మవార్ల తీర్థాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తీర్థం సందర్భంగా గ్రామ ఆడపడుచులు అమ్మవారికి ముడుపులు, మొక్కులు, చలివిడి పానకాలు సమర్పించి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గురువారం రాత్రి నిర్వహించిన అమ్మవార్ల జాతరలో గరగ నృత్యాలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

వ్యాయామంతోనే ఆరోగ్యం



అమలాపురం హైస్కూలు సెంటర్‌లో సైకిల్ ర్యాలీ ప్రారంభిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు



తాళ్లరేవు ప్రధాన రహదారిలో ర్యాలీ చేస్తున్న గాడిమొగ పీహెచ్‌సీ సిబ్బంది

అమలాపురం టౌన్: వ్యాయామంతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు యర్రమిల్లి సత్యనారాయణమూర్తి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక వాకర్స్ హెల్త్ క్లబ్‌కు చెందిన వాకర్స్ ఆరోగ్యంపై ప్రజలను చైతన్యపరుస్తూ పట్టణంలో శుక్రవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సైకిల్ ర్యాలీ గడియారం స్తంభం సెంటర్, హైస్కూలు సెంటర్, భూపయ్య అగ్రహారం, కొంకాపల్లి, కూచిమంచి అగ్రహారం, నల్లవంతెన, ఎర్రవంతెన మీదుగా సాగింది. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్, కోశాధికారి పచ్చిగోళ్ల రాజా, వాకర్స్ ఏరియా కోఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి, ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, రంకిరెడ్డి కాశీ తదితరులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

ఆరోగ్య దినోత్సవ ర్యాలీ

తాళ్లరేవు: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రధాన రహదారిలో గాడిమొగ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అందరికీ ఆరోగ్యం నినాదంతో ర్యాలీ నిర్వహించి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ పేయా సీతామహాలక్ష్మి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటించడం ద్వారా ఆరోగ్య సమాజాన్ని నిర్మించొచ్చన్నారు. ఆరోగ్యాన్ని రక్షించుకునేందుకు నిత్యం శారీరక వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ, సీహెచ్‌సీ సిబ్బంది కాలా ఆంజనేయులు, జ్యోతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే అశోక్‌ను కలిసిన ముస్లిం యువకులు

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో ముస్లిం సోదరుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను ముస్లిం యువకులు కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు ద్వారా ముస్లిం విద్యార్థినీవిద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల మంజూరు కోసం అసెంబ్లీలో ప్రస్తావించినట్లు తెలిపారు. ముస్లిం శ్మశానవాటిక అభివృద్ధికి రూ.16 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులు మొదలుపెడతామని తెలిపారు. మైనారిటీలైన ముస్లింల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం యువకులు పాల్గొన్నారు.

అమ్మవారి మెడలో పుస్తెల చోరీ



అగంతకుడు తెచ్చిన చీర



బులి బాపనమ్మ అమ్మవారు

రాయవరం: మండలంలోని సోమేశ్వరం గ్రామ దేవత బులి బాపనమ్మ వారి ఆలయంలో అగంతకుడు 10గ్రాముల పుస్తెల తాడు చోరీకి పాల్పడ్డాడు. అమ్మవారికి చీరలు పెట్టే నెపంతో అగంతకుడు గురువారం మధ్యాహ్నం ఈ చోరీకి పాల్పడినట్టు స్థానికుల ద్వారా తెలుస్తోంది. ఆలయానికి తాళాలు వేసి ఉండడంతో చీరలను అమ్మవారికి వేస్తున్నట్లుగా నటిస్తూ కర్రతో అమ్మవారి మెడలోని సూత్రాలను తెంపుకు పోయినట్లుగా సమాచారం. అగంతకుడు పల్సర్ మోటార్ సైకిల్‌పై వచ్చినట్టు ప్రత్యక్ష సాక్షి ద్వారా తెలుస్తోంది. ఆలయం గురించి అన్ని విషయాలు తెలిసిన వ్యక్తే ఈ చోరీకి పాల్పడినట్లుగా స్థానికులు భావిస్తున్నారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు రాయవరం ఎస్సై సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.